క్లుప్తంగా

వైభవంగా బోనాల పండగ



శరభవంలో అమ్మవారిని దర్శించుకుంటున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని శరభవరంలో కనకదుర్గమ్మ అమ్మవారి బోనాల పండుగను భక్తులు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. స్థానిక మహిళలు, యువతులు బోనాలను నెత్తిన పెట్టుకుని గ్రామంలో భారీ ఎత్తున ఊరేగించారు. అనంతరం స్థానిక భక్తులు అమ్మవారికి సారె, చీర సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఊరేగింపులో డప్పులు, కోలాటం, తప్పెట గుళ్ల, గరగలు వంటి సాంప్రదాయ కళలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు పాల్గొని కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ కమిటీకి ఐదు వేలు విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలి



రంప యర్రంపాలెంలో ధర్నా చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

గోకవరం: రంపచోడవరం, పోలవరం అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలోని సబ్ ప్లాన్ ప్రాంతాలన్నింటిని కలిపి రంపచోడవరం కేంద్రంగా ఆదివాసీ జిల్లాగా ప్రకటించాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని రంప యర్రంపాలెంలో ధర్నా నిర్వహించారు. పాడేరు నుంచి ఎటపాక, చింతూరు, దేవీపట్నం మండలాల ప్రజలకు పరిపాలన చేరువ చేయడం కష్టమవుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం జిల్లాల పునర్విభజన మీద మంత్రులతో ఒక సబ్ కమిటీని నియమించినందున ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలలోని రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాలలోని అన్ని ఆదివాసి మండలాలను కలిపి ఒక ప్రత్యేక జిల్లాగా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్లూరి రాజబాబు, బి.రమేష్, పిడిఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితి సతీష్, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు రెడ్డి దుర్గాదేవి, చంద్రమ్మ, దుర్గ, వీరాఘవమ్మ, నరసమ్మ, అబ్బులు, అప్పారావు, వీరపండు తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథా...ప్రజల వ్యథ!



మల్లేపల్లి బీసీ కాలనీలో ట్యాంక్ నుంచి వృథా పోతున్న నీరు

గండేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో రక్షిత మంచినీటి సరఫరాపై అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరు వృథాగా పోతుంది. తాళ్లూరు, మల్లేపల్లి, తదితర గ్రామాల్లో నీరు వృధా అవుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. తాళ్లూరులో పంచాయతీ కార్యాలయం, సచివాలయానికి సమీపంలో ఉన్న కుళాయి నుంచి నీరు వృథాగా పోతున్నప్పటికి పాలకులుగాని, పంచాయతీ కార్యదర్శి పట్టించుకోకపోవడం శోచనీయం. గృహ అవసరాలకు నీరు సక్రమంగా అందడంలేదని గ్రామ ప్రజలు గగ్గోలు పెడుతున్న నీటి వృథాపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల గ్రామస్తులు అధికారుల తీరుపై విమర్శలు చేస్తున్నారు. మల్లేపల్లి బీసీ కాలనీలో గల జీఎల్ఆర్ ట్యాంక్, కుళాయిల నుంచి నీరు వృథాగా పోతున్నప్పటికి పట్టించుకోవడంలేదని స్థానికులు చెబుతున్నారు. వృథాగా పోతున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల సర్వత్ర చర్చనీయాంశంగా మారింది.

రహదారి దుస్థితిని చూసి సిగ్గుపడుతున్నా..

రౌతులపూడి: కత్తిపూడి–రౌతులపూడి రహదారి దుస్థితిని చూసి సిగ్గుపడుతున్నానని ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలో ఆయన పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ రహదారి నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యేతో కలసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరలో నిర్మాణానికి కృషి చేస్తానన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

శంఖవరం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వం పనిచేస్తుందని కాకినాడ ఎంపీ పేర్కొన్నారు. మండలంలోని నెల్లిపూడిలో ఆదివారం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పల్లెల్లో చెత్తపట్టాల

- గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలు
- దుర్గంధంతో స్థానికులు సతమతం
- మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ కరవు

కిర్లంపూడి: మండల వ్యాప్తంగా పారిశుధ్యం కొరవడింది. ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారులు, వీధుల్లోనూ ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అధికారులు అమలు చేయడంలో విఫలం అవుతున్నారని ప్రజల నుంచి బహిరంగంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల స్థాయి అధికారులు కార్యాలయానికే పరిమితమై, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను విస్మరించడంతో రోజుల తరబడి చెత్తకుప్పలు, డ్రైనేజీల్లో మురుగు పేరుకుపోతోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నామని అధికారులు చర్యలు తీసుకోవాలని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బందికి జీతాల నిలుపుదల

ప్రతీ రోజు పురవీధుల్లో సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించి తడి, పొడి చెత్త వేరు చేసి చెత్త నుంచి పంట ఎరువును తయారు చేసి తద్వారా పంచాయతీలకు సంపద సృష్టించాలనే ఉద్దేశంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి గ్రామంలోనూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు శ్రీకారం చుట్టాయి. కానీ గ్రామాల్లో చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించే సిబ్బందికి పూర్తిస్థాయిలో జీతాలు చెల్లించకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. చెత్త సేకరణ లేని గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలను ఇష్టానుసారం వేస్తున్నారు. చినుకుపడితే చాలు దుర్గంధం వెదజల్లడంతో ప్రయాణికులు, గ్రామస్తులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి మండలంలోని ఎస్.తిమ్మాపురంలో ఊరు శివారున ప్రధాన రహదారి పక్కన నెలలు తరబడి ఉన్న పెంటకుప్పే నిదర్శనంగా నిలుస్తుంది.

అధికారుల అలసత్వం

ఎస్.తిమ్మాపురం, గెద్దనాపల్లిలో రోడ్డుపై చెత్త కుప్పలు పెరిగిపోయాయి. శృంగరాయునిపాలెం, సోమవరం, వేలంకతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని డ్రైనేజీలో మురుగు నీరు పారకపోవడంతో ఇళ్ల ముందే రోజుల తరబడి నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతుంది. అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పేరుకుపోతున్న చెత్తకుప్పలు, డ్రైనేజీల్లో మురుగునీరు పంచాయతీ అధికారుల కంట పడడం లేదా? ఒక వేళ చూసే వాటిని తొలగించే చర్యలు చేపట్టడం లేదా? అని గ్రామస్తులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. గ్రామాల పరిశుభ్రతే ప్రధాన లక్ష్యంగా పనిచేయాల్సిన పంచాయతీ అధికారులు ఎందుకు అలసత్వం వహిస్తున్నారో అర్థం కావడం లేదని, గ్రామాల పరిశుభ్రతే ప్రధాన లక్ష్యంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమం మాటలకే పరిమితం అవుతుందని గ్రామస్తులు మండిపడుతున్నారు.

డ్రైనేజీ వ్యవస్థ అంతంత మాత్రమే..

గ్రామాల్లో డ్రైనేజీలను పరిశుభ్రం చేయడంలో అధికారం యంత్రంగా విఫలమవుతుంది. సోమవరం ఎస్సీపేటలో డ్రైనేజీ మురుగుతో నిండిపోవడంతో నీరు ముందుకు పారే అవకాశం లేక అక్కడే నిలిచిపోతోందనీ, పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో తామే డ్రైనేజీలను శుభ్రం చేసుకుంటున్నామని స్థానికులు చెబుతున్నారు.

వ్యాధుల విజృంభణ

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో పరిసరాల్లో కుళ్లిన పెంటకుప్పలు, డ్రైనేజీల్లో పేరుకుపోయిన మురుగు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో పరిస్థితి మరింత దయనీయంగా మారిందని దోమలతో కంటిమీద కునుకు ఉండడం లేదని గ్రామస్తులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో మండల స్థాయి అధికారులు పర్యటించి గ్రామాల పరిశుభ్రతపై చర్యలు చేపట్టాలని, సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.



ఎస్.తిమ్మాపురం ఊరు శివారున ప్రధాన రహదారి పక్కన పెంటకుప్ప



సోమరాయణంపేట జగనన్న కాలనీలో రోడ్డుపై మురుగు నీరు



సోమవరం ఎస్సీపేటలో డ్రైనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలు



శృంగరాయునిపాలెం డ్రైనేజీలో ముందుకు పారని మురుగునీరు

మురుగు తొలగించాలి



గ్రామాల్లోనీ డ్రైనేజీల్లో పేరుకుపోయిన మురుగు కారణంగా దోమలు చేరి విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంది. గ్రామస్తులు అనారోగ్యాల బారిన పడకుండా అధికారులు స్పందించి డ్రైనేజీలను శుభ్రం చేయాలి. పంచాయతీ సిబ్బంది పురవీధుల్లో చెత్త సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలి.

–నకిరెడ్డి సుధాకర్, శృంగరాయునిపాలెం

ఆదేశాలు జారీ చేస్తాం

ఎస్.తిమ్మాపురం సెక్రటరీ అనారోగ్యంగా ఉండడం వల్ల వ్యర్థాలను తొలగించలేకపోయం. ఆయన వచ్చిన వెంటనే కుప్పలను తొలగించాలని ఆదేశిస్తాం. సోమవరం, శృంగరాయునిపాలెం గ్రామాల్లోని డ్రైనేజీలను శుభ్రం చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం.

–సత్యప్రసాద్, డిప్యూటీ ఎంపీడీఓ, కిర్లంపూడి

కూటమిలో పేట్రేగుతున్న అరాచకాలు

- రెడ్ బుక్ పాలనను ప్రజలు గమనిస్తున్నారు
- నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దు
- డిజిటల్ బుక్ ఆవిష్కరణలో తోట వ్యాఖ్యలు



జగ్గంపేట కార్యాలయంలో డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న తోట నరసింహం, తదితరులు

జగ్గంపేట: కూటమి ప్రభుత్వంలో అరాచకాలు పెరుగుతున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం పేర్కొన్నారు. జగ్గంపేట పార్టీ కార్యాలయంలో ఆదివారం డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు మహిళలు, సామాన్య ప్రజానికం, వైఎస్సార్ సీపీకి చెందిన వారిపైన కవ్వింపు చర్యలు, అరాచకాలకు, అనేక రకాలుగా వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. మంత్రి లోకేశ్ ముందుగా చెప్పినట్టుగానే రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన సాగుతుందని, ముఖ్యంగా పార్టీకి చెందిన వారిపై లేనిపోని కేసులు బనాయిస్తున్నారని, కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎవరు అధైర్యపడాల్సిన పనిలేదని భరోసా కల్పించారు.

డిజిటల్ బుక్‌తో భరోసా

కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను దృష్టిలో ఉంచుకుని పార్టీ అధిష్టానం డిజిటల్ బుక్‌ను ప్రవేశపెట్టిందని కూటమి ప్రభుత్వం వల్ల బాధింపబడ్డ ప్రతి ఒక్కరూ ఈ డిజిటల్ బుక్‌లో నమోదుచేసుకునే విధంగా వెసులుబాటు కల్పించినట్టు పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ప్రత్తిపాడు, కాకినాడ రూరల్ నియోజకవర్గాల పరిశీలకులు ఒమ్మి రఘురాం మాట్లాడుతు అన్యాయానికి, ఆవేదనకు గురైన ప్రతి ఒక్కరు డిజిటల్ బుక్‌లో నమోదు చేసుకోవచ్చునని, 13 సంవత్సరాల వయస్సు నుంచి ప్రతి ఒక్కరు అర్హులేనని, డిజిటల్ బుక్‌లో ఒక్కసారి నమోదు అయితే అది అలానే ఉంటుందన్నారు. నంబర్ 04049171718 కు ఫిర్యాదు చేయాలన్నారు. సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు బేకరి బాబు, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కరుటూరి వీర్రాజు, జగ్గంపేట మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు బోండు అమృత రావు, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ అమలు పర్యవేక్షణ బాధ్యత అందరిదీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శివమణి


తుని రూరల్: ఎస్సీ వర్గీకరణ అమలు అవుతుందో లేదో పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి మాదిగ సోదరుడిపై ఉందని జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పలివెల శివమణి పేర్కొన్నారు. ఆదివారం తుని మండలం లోవకొత్తూరులో ఎంఆర్పీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించా. రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య అక్టోబరు 6న జిల్లాలో పర్యటిస్తున్నారని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో అన్నవరంలో నిర్వహించనున్న దండోర మహాసభను జయప్రదం చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ సక్రమంగా అమలు జరుగుతుందో లేదో ఎప్పటికప్పు ప్రతిఒక్కరు పర్యవేక్షించినప్పుడే ఫలితాలు లభిస్తాయన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం మాదిగలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు పలివెల రవి అనంతకుమార్, ప్రధాన కార్యదర్శి మందపల్లి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు పలివెల సతీష్, తుని మండల ఇన్‌చార్జ్ చిందాడ నాగేశ్వరరావు, గంటేటి లోవరాజు, మార్లపూడి రాజు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: దేశం కోసం ప్రాణాలర్పించిన విప్లవవీరుడు భగత్‌సింగ్ జయంతి వేడుకలు పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కమిషనర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ మాట్లాడుతూ దేశంకోసం ప్రాణాలు సైతం లెక్కచేయని భగత్ సింగ్ జీవితం యువతకి ఆదర్శమన్నారు. భగత్‌సింగ్ ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. బ్రిటీషు వారిని ఎదిరించి చిన్నవయస్సులోనే ప్రాణాలు కోల్పోయారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పైల విజయ్‌కుమార్, కోరాడ ప్రసాద్, కావలి శ్రీనివాసరావు, అరవాల నాగరాజు, గోళ్ల విజయ్‌కుమార్, ఉద్దగిరి సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



గోకవరం జెడ్పీ హైస్కూల్ 1999 - 2004 పూర్వ విద్యార్థులు

గోకవరం: మండల కేంద్రం గోకవరం శ్రీ దాసరి చిన్న ధర్మరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో 1999 నుంచి 2004 వరకు విద్యను అభ్యసించిన విద్యార్థులంతా ఒక్క చోటుకు చేరుకుని జీవితంలో స్థిరపడిన విధానాన్ని గుర్తు చేసుకున్నారు. సుమారు 150 మంది విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన 20 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కుటుంబ సభ్యులు, మిత్రులతో ఆటపాటలతో సందడి చేసి అలనాటి తీపిగుర్తులను నెమరవేసుకున్నారు.

వైభవంగా బెండపూడి కాగితమ్మ జాతర

తొండంగి: మండలంలోని బెండపూడి గ్రామదేవత కాగితమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామంలోని తూర్పుకాపుల వీధికి చెందిన సుమారు 500 మంది మహిళలు పసుపు చీరలు ధరించి పసుపునీటి బిందెలతో ఊరేగింపుగా గ్రామ శివారులో కాగితమ్మ ఆలయంలో అమ్మవారికి అభిషేకించారు. అమ్మవారికి పసుపుకుంకుమ, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గరగ నృత్యాలు, తప్పెటగుళ్ల వంటి సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఇంటెలిజెంట్ సొల్యూషన్స్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శివశంకర్‌రావు

తుని: స్థానిక ద్వారాకా నగర్‌లో ఇంటెలిజెంట్ సొల్యూషన్స్ నూతన కార్యాలయాన్ని ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, కె.శివశంకర్‌రావు ఆదివారం ప్రారంభించారు. తుని పరిసర ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు స్పోర్ట్స్, స్కిల్స్, రోబోటిక్ స్కిల్స్‌పై అవగాహనపై సదస్సు నిర్వహించారు. దీని ద్వారా జూడో, టైక్వాండో, సైకిల్ పోలో బాక్సింగ్, ఉమెన్ సెల్ఫ్ డిఫెన్స్‌లపై శిక్షణ అందించి ఆయా పోటీల్లో విజేతలుగా తీర్చిదిద్దేందుకు సంస్థ కృషి చేస్తుందన్నారు.

మహాచండీ దేవిగా కనకదుర్గ



రౌతులపూడి సినిమా సెంటర్‌లో మహాచండీదేవి అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



కుమ్మరివీధి కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహించిన చండీయాగం



మల్లేపల్లిలో అమ్మవారిని పూజిస్తున్న భక్తులు



సంప్రదాయ వేషధారణలో ఆదిత్య ఫార్మసీ విద్యార్థినులు



ఏలేశ్వరంలో సారెతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న మహిళలు

రౌతులపూడి: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానిక సినిమా సెంటర్‌లో వేంచేసియున్న కనకదుర్గ అమ్మవారు ఏడోవ రోజు ఆదివారం మహాచండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పసుపు కొమ్ములతో అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వేకువ జామునుంచి ఆలయానికి వచ్చి మహాచండీ దేవిగా అలంకరించిన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకమార్చన కార్యక్రమంలో పురోహితులు బానుభాబు తదితరులు వేదమంత్రోచ్ఛరణ చేశారు. రౌతులపూడి సత్యదేవా కాలనీకి చెందిన పలువురు భక్తులు అమ్మవారికి చీర,సారెలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులు పాల్గొన్నారు.

త్రిపుర భైరవిగా అమ్మవారు దర్శనం

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి కొత్తూరులో కొలువుతీరిన విజయ కనకదుర్గ అమ్మవారు త్రిపుర భైరవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా పురోహితులు చింతా అరుణ కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ కావించి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాలు స్వీకరించారు.

మహా చండీ యాగం

కిర్లంపూడి: శరన్నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని జగపతినగరం అభయదుర్గమ్మ, కిర్లంపూడిలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవార్లు ఆదివారం మహాచండీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కుమ్మరివీధిలోని వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ ఆలయం వద్ద మహాచండీ హోమం నిర్వహించారు. యువ నాయకుడు తోట వరుణ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించారు.

మహా చండీ దేవిగా దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన దేవీ చౌక్ ఆలయంలో కనకదుర్గమ్మ వారు శ్రీ శరన్నవరాత్ర ఉత్సవాల్లో ఆదివారం శ్రీమహా చండీ దేవిగా దర్శనమిచ్చారు. ఆలయం తెల్లవారుజాము నుంచి ఆలయ అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాధశర్మ, శ్రీనివాస్‌శర్మలు అమ్మవారికి అలంకారం పూజలు, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక వీరభద్రునిగద్దెలోని కనకదుర్గమ్మను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు.

చండీ దేవిగా బాల త్రిపుర సుందరి

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో దేవి శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని చండీదేవిగా అలంకరించారు. రాజమండ్రికి చెందిన శిష్ట వెంకటరమణ మూర్తి, పద్మలత దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి కుంకుమ పూజ జరిపించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

చండీదేవికి సారె సమర్పణ

ఏలేశ్వరం: శ్రీదేవి శరన్నవరాత్రుల్లో భాగంగా పట్టణంలో ఆదివారం అమ్మవారికి పిండివంటలతో సారెను నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు సారెతో పట్టణంలోని తోటవీధి, మరిడమ్మ గుడి, నందివీధి, నెయ్యిలపేట, సామంతుల వారి వీధి, రూపులమ్మగుడి, ఆర్టీసీ కాంప్లెక్స్ దుర్గాదేవి గుడి, చెరువుగట్టు వీధి సత్తెమ్మ తల్లి గుడి మీదుగా స్థానిక తోటవీధిలో వేంచేసియున్న దుర్గాదేవి ఆలయం వరకు సారెతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దుర్గాదేవి అమ్మవారు మహాచండిగా అలంకరణలో దర్శనమివ్వగా సారెను అందజేసి దర్శించుకున్నారు.

ఆదిత్యలో దసరా సంబరాలు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఫార్మసీ విద్యార్థులు దసరా శరన్నవరాత్ర సంబరాల్లో భాగంగా ఆదివారం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వివరిస్తూ నృత్యాలతో అలరించారు. సంప్రదాయ వేషధారణలతో ఏర్పాటు చేసిన దుర్గా మండపం వద్ద యువతులు పూజలు నిర్వహించారు.

సామూహిక కుంకమార్చనలు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద శ్రీ విజయదుర్గా అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం సామూహిక కుంకమార్చనలు నిర్వహించారు. పురోహితుడు నరేష్ విఘ్నేశ్వర పూజతో విశేష అర్చనలకు శ్రీకారం చుట్టారు. అప్పికొండ అయ్యప్ప దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈసామూహిక కుంకమార్చనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాత్రి అమ్మవారికి పడి పూజ నిర్వహించారు. ఈపడిపూజలో భారీ ఎత్తున భవానీ భక్తులు పాల్గొన్నారు.

మహా చండీ దేవిగా అపీత కుచాంబ

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శరన్నవరాత్ర ఉత్సవాల్లో 7వ రోజైన ఆదివారం దుర్గాదేవి అమ్మవారు మహా చండీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాచపల్లి అరుణాచల క్షేత్రంలో అపీత కుచాంబ అమ్మవారు, ధర్మవరం, ఒమ్మంగి గ్రామాల్లో విజయదుర్గమ్మ అమ్మవారు, గజ్జనపూడిలో రాజరాజేశ్వరి అమ్మవారు ఆదివారం మహా చండీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.